సాక్షి
కుమురం భీం

గురువారం : 22 : ఫిబ్రవరి : 2024



గద్దెపై కొలువుదీరిన సారలమ్మ

వన దేవతల జాతర మహోత్సవం బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు డప్పు చప్పుళ్ల మధ్య సారలమ్మ తల్లి గద్దెపైకి చేరుకుంది. 9లో▸



సీసీరోడ్లతో కొత్త శోభ

'ఉపాధి' నిధులతో చేపడుతున్న సీసీరోడ్లతో గ్రామాలు కొత్త శోభ సంతరించుకుంటున్నాయి. రెబ్బెన మండలంలో 51 సీసీరోడ్లకు రూ.1.51 కోట్లు మంజూరయ్యాయి. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.6 /18.8

ఆకాశం ప్రకాశవంతంగా, నిర్మలంగా ఉంటుంది. పగలు వేడిగా ఉంటుంది. రాత్రిపూట చాలా వరకు చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 26 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ జాబ్‌మేళాలో వివిధ రంగాలకు చెందిన సుమారు 50 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ పూర్తి చేసిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాను తెలిపే సర్టిఫికెట్లు, ఫొటోలతో హాజరు కావాలన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న డీఈవో అశోక్

లింగాపూర్(ఆసిఫాబాద్): విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఈవో అశోక్ అన్నారు. లింగాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి మార్కులు సాధిస్తారన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నృత్యాలు, ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రాథోడ్ సుభాష్, కేజీబీవీ ఎస్‌వో సరస్వతి, ఉపాధ్యాయులు, సిబ్బంది రామారావు, శైలజ, గోదావరి, అంజలి, జాదవ్ సంజీవ్ పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం విదేశీ విద్యా పథకం కింద డిగ్రీ(ఇంజనీరింగ్)లో 60శాతం మార్కులు పొంది పోస్టు గ్యాడ్యుయేషన్ చేసేందుకు, పీజీలో 60 శాతం మార్కులు ఉండి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు అర్హులని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే అభ్యర్థులు ఫాల్ సీజన్ 2023 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఎంపిక చేసిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ పొంది ఉండాలని సూచించారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీల వర్గాలకు చెందిన అభ్యర్థులు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో మార్చి 20 సాయంత్రం 5గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను ఏప్రిల్ 15లోగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అందించాలన్నారు.

నేడు జిల్లాలోకి విజయ సంకల్పయాత్ర



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర(కుమురంభీం క్లస్టర్) జైనూర్ మీదుగా గురువారం జిల్లాలోకి ప్రవేశిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జైనూర్ మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటలు, ఆసిఫాబాద్‌లోని అంబేద్కర్ చౌక్ వద్ద సాయంత్రం 6 గంటలకు నిర్వహించే రోడ్‌షోలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సెర్ల మురళి, నాయకులు గణేశ్, శ్రీనివాస్, వెంకటేశం, శ్రవణ్‌గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.



గంగాపూర్ జాతర సన్నాహక సమావేశంలో కలెక్టర్ వెనుక హెచ్‌హెచ్‌పీ రాజశేఖర్(కలెక్టర్ అనధికారిక సీసీ)

ఆసిఫాబాద్‌లోని సెయింట్ మేరీ హైస్కూల్ వద్ద అదనపు కలెక్టర్(రెవెన్యూ)కు చెందిన ప్రభుత్వ వాహనం





అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేణు వినియోగిస్తున్న అద్దె కారు

కలెక్టరేట్‌లో ఇష్టారాజ్యం

- అదనపు కలెక్టర్‌కు అద్దె కారు..?
- ప్రైవేటు పనులకు ప్రభుత్వ కారు!
- కంప్యూటర్ ఆపరేటర్లకు మళ్లీ అందలం
- క్యాంప్ క్లర్క్ హోదాలో పనుల అప్పగింత
- సీసీల నియామకం చేపట్టలేదంటున్న పెద్దసారు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా కలెక్టరేట్‌లో కంప్యూటర్ ఆపరేటర్లే పరిపాలన కొనసాగిస్తున్నారా..? అంటే అవుననే సమాధానం అధికారవర్గాల నుంచే వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు సైతం వారి మీదే ఆధారపడటంతో అనధికారికంగా వారు(కంప్యూటర్ ఆపరేటర్లు) క్యాంప్ క్లర్క్‌ల హోదాల్లో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. జిల్లా సర్వోన్నతాధికారి సైతం వారికి వత్తాసు పలుకుతుండటం కొసమెరుపు. దీంతో కలెక్టరేట్‌లో అనధికారిక సీసీల ఇష్టారాజ్యం నడుస్తోందన్న విమర్శలు అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

'అర్హత లేకున్నా అందలం' శీర్షికతో గత నెలలో 'సాక్షి' అనధికారిక సీసీలపై కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనానికి కలెక్టర్ స్పందిస్తూ.. తన వద్ద పనిచేస్తున్న రాజశేఖర్(అనధికారిక సీసీ) హ్యాండ్ హోల్డింగ్ పర్సన్(హెచ్‌హెచ్‌పీ) కేవలం కంప్యూటర్ విధులకు మాత్రమే అతని సేవలు వినియోగిస్తున్నామన్నారు. అదేవిధంగా ఇద్దరు అదనపు కలెక్టర్లు, డీఆర్‌వో వద్ద పనిచేస్తున్న కార్తీక్,



ఎన్నికల సిబ్బందితో ఈ నెల 15న నిర్వహించిన సమావేశంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ వెనక హెచ్‌హెచ్‌పీ రాజశేఖర్(కలెక్టర్ అనధికారిక సీసీ)

షఫీ, జావీద్ కూడా కంప్యూటర్ ఆపరేటర్లుగానే సేవలందిస్తున్నారని అప్పట్లో స్పష్టం చేశారు. అయితే వారు ఏనాడు కంప్యూటర్ విధుల్లో పనిచేసిన దాఖలాలు కనిపించలేదని కలెక్టరేట్ వర్గాల నుంచే విమర్శలు వినిపించాయి. ఇటీవల ఓ అనధికారిక సీసీ ఏకంగా జిల్లా అధికారులతో రివ్యూ చేసినట్లు సమాచారం. 'ఉన్నతాధికారి లేకుండా ఇదేం రివ్యూ రా బాబు' అంటూ సమావేశంలో పాల్గొన్న అధికారులు తల పట్టుకొన్నట్లు తెలుస్తోంది. కలెక్టర్ స్పష్టం చేసినట్లుగా రాజశేఖర్ కంప్యూటర్ విధులేమీ నిర్వహించడం లేదని సమాచారం. అతను మళ్లీ కలెక్టర్ సమావేశాల్లో పాల్గొంటుండడం గమనార్హం. కలెక్టర్ ఎక్కడికి వెళ్లినా అతను తప్పకుండా వెంట వెళ్తున్నారు. కలెక్టర్‌కు అన్నీ అతనే అన్నట్లుగా వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్(రెవెన్యూ), డీఆర్‌వోల వద్ద కంప్యూటర్ ఆపరేటర్ పేరిట విధులు నిర్వహిస్తున్న కార్తీక్, షఫీ, జావీద్‌లు సైతం అనధికారిక సీసీలుగా కొనసాగుతుండడం విశేషం. మంగళవారం సైతం గంగాపూర్ పర్యటనలో కలెక్టర్ వెంట రాజశేఖర్, కాగజ్‌నగర్ పర్యటనలో అదనపు కలెక్టర్ దాసరి వేణు వెంట షఫీ పాల్గొన్నారు. నిజంగా వారిని కంప్యూటర్ విధులకే వినియోగిస్తుంటే వారిని తమ వాహనాల్లో ఉన్నతాధికారులు ఎందుకు తీసుకెళ్తున్నారో అర్థం కాని ప్రశ్నగా నిలుస్తోంది. వాస్తవానికి అధికారిక సీసీలు ఉన్నప్పటికీ వారి సేవలు పెద్ద వినియోగించుకోకపోవడం విడ్డూరంగా కనిపిస్తోంది. ఉన్నతాధికారుల పేర్లు చెప్పి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వారిపై ఉన్నా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కలెక్టరేట్‌లో ఇష్టారాజ్యానికి అద్దం పడుతోంది.

అధికార దుర్వినియోగం...

కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ప్రభుత్వ వాహనాలు ఉన్నాయి. అలాగే ఆసిఫాబాద్ ఆర్డీవో, పదిహేను మండలాల తహసీల్దార్లకు సంబంధించిన వాహనాలకు సర్కారు అద్దె చెల్లిస్తోంది. అయితే గత రెండు నెలలుగా అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు మాత్రం ప్రభుత్వ వాహనానికి బదులుగా ఒక ప్రైవేటు వాహనాన్ని వినియోగిస్తున్నారు. అతని కోసం కేటాయించిన ప్రభుత్వ వాహనాన్ని జిల్లా కలెక్టర్ తీసుకున్నారు. అయితే ఆ వాహనాన్ని అతను అధికారి విధుల కోసం వినియోగించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తన సొంత పనులకు ఆ కారును వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. కుమార్తెను పాఠశాలకు తీసుకెళ్లేందుకు, ఇతరత్రా అవసరాలకు ప్రభుత్వ కారును వినియోగిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, జిల్లా సర్వోన్నతాధికారి వాహనాన్ని మరమ్మతుల కోసం హైదరాబాద్‌లోని షోరూంకి తరలించగా.. ఆయన మంచిర్యాలకు చెందిన మరో అద్దె కారును ప్రస్తుతం వినియోగిస్తున్నారు. ఈ వాహనం అద్దె సైతం సింగరేణి సంస్థ చెల్లిస్తోందని సమాచారం. అయితే ఆయనకు మరో కారు ఉండగా.. మళ్లీ అదనపు కలెక్టర్ కారును రెండు నెలలుగా వినియోగిస్తుండటంపై కలెక్టరేట్ ఉద్యోగవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా, అదనపు కలెక్టర్ అద్దె వాహనాన్ని ఎందుకు వినియోగిస్తున్నారని కలెక్టరేట్‌లోని ఓ ముఖ్య అధికారిని 'సాక్షి' ప్రశ్నించగా.. ఆ కారు రిపేర్‌లో ఉందని సమాధానం ఇవ్వడం కొసమెరుపు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి బుధవారం నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఓటరు హెల్ప్‌లైన్ నంబర్ 1950 ఏర్పాటు చేస్తామన్నారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. కార్యాచరణ రూపొందించి సమర్పించాలని ఆదేశించారు.

స్ట్రాంగ్‌రూంలకు గదులు గుర్తించాలి

ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూంలను పీటీజీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని, స్ట్రాంగ్ రూంల కోసం అనువైన గదులు గుర్తించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. వాహనాల పార్కింగ్, భోజన వసతి ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. వారి వెంట తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే తదితరులు ఉన్నారు.

నేడే ఆఖరు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులకు నేటితో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు https://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

కాంగ్రెస్ గూటికి 'పాల్వాయి'?

- ఉమ్మడి జిల్లాలో బీజేపీ విజయ సంకల్పయాత్రకు దూరం
- ఊపందుకున్న ప్రచారం
- సీఎం రేవంత్‌ను కలిసిన సిర్పూర్ ఎమ్మెల్యే
- నియోజకవర్గ అభివృద్ధి కోసమేనన్న హరీశ్‌బాబు

సాక్షి, ఆసిఫాబాద్: సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు కాంగ్రెస్ పార్టీలోకి చేరనున్నారనే ప్రచారం ఊపందుకుంది. బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం ఆ ప్రచారానికి బలం చేకూర్చినట్లయింది. అయితే ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాత్రం తాను కేవలం నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ నుంచే రాజకీయ ప్రస్థానం..

సిర్పూర్ నియోజకవర్గంలో హరీశ్‌బాబు గట్టి పట్టుంది. హరీశ్‌బాబు తండ్రి పాల్వాయి పురుషోత్తంరావు 1989, 1994లో వరుసగా రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన తల్లి రాజ్యలక్ష్మి సైతం 1999లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందడం విశేషం. రాజకీయ నేపథ్య కుటుంబం నుంచి వచ్చిన పాల్వాయి హరీశ్‌బాబు ఆర్థోపెడిక్ సర్జన్. 2017 నవంబరులో రాజకీయ అరంగ్రేటం చేశారు. బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామంలో 10 అంశాలతో రాజకీయ ఎజెండాను రూపొందించి ప్రజల్లోకి వచ్చారు. ఏడాది పాటు రాజకీయ కార్యక్రమాలు చేపట్టిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018లో కాంగ్రెస్ టికెట్‌తో సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను వీడి



సీఎంకు సమస్యలు వివరిస్తున్న హరీశ్‌బాబు

బీజేపీ తీర్థం పుచ్చుకుని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

పార్లమెంట్ ఎన్నికలే ధ్యేయంగా పావులు

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇతర పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నేతల్ని కాంగ్రెస్‌లోకి చేర్చుకునేందుకు సిద్ధమవుతోంది. పాల్వాయి హరీశ్‌బాబు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆ పార్టీ అధిష్టానం కూడా సుముఖంగానే ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చాక హరీశ్‌బాబు వెంటే కాంగ్రెస్ పార్టీ క్యాడర్ రావడం.. ప్రజల్లో కూడా అతనిపై సానుభూతి ఉండటం అసెంబ్లీ ఎన్నికల్లో పాల్వాయికి కలిసొచ్చిందని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం కూడా ఇలాంటి వారిని పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కలిసొచ్చే అంశంగా పార్టీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

'సిర్పూర్ అభివృద్ధి కోసమే కలిశా'

కౌటాల(సిర్పూర్): సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే హరీశ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయంపై 'సాక్షి' ఎమ్మెల్యేను సంప్రదించగా.. ముఖ్యమంత్రి కేవలం పార్టీ ప్రతినిధి కాదని.. ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి అధినేత అని అన్నారు. అన్ని పార్టీల ఎమ్మెల్యేలు పనుల కోసం సీఎంను కలుస్తున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలకు తావులేదని స్పష్టం చేశారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

బీజేపీ కార్యక్రమాలకు దూరంగా..?

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ఎమ్మెల్యే హరీశ్‌బాబు పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటూ వస్తున్నారు. కేవలం నియోజవర్గంలో తిరుగుతూ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు తదితరాల్లో పాల్గొంటున్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధిష్టానం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఐదు విజయ సంకల్ప యాత్రలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మంగళవారం కుమురంభీం క్లస్టర్ యాత్రను అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు ప్రారంభించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌బాబు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలవడంతో పార్టీ మారుతున్నారనే ప్రచారం ఊపందుకుంది.

ఓట్ల కోసం చరిత్ర మార్చొద్దు

- కాపాడుకునేందుకు కలిసిరావాలి
- బీజేపీ నాయకులు బండి, ఏలేటి
- వెయ్యి ఉరులమర్రి వరకు బైక్‌ర్యాలీ

నిర్మల్: 'ఒకవర్గం ఓట్ల కోసం ఆదివాసీవీరుల చరిత్రను తెరమరుగు చేసే కుట్ర చేస్తారా.. చరిత్రను తెరమరుగు చేయాలనుకున్న బీఆర్ఎస్ సర్కార్‌నే కనుమరుగు చేసిన చరిత్ర ప్రజలదని గుర్తుపెట్టుకోవాలి' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. బీజేపీ విజయ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్‌తో కలిసి బైక్‌ర్యాలీగా వెయ్యి ఉరులమర్రి అమరుల స్మారకస్తూపం వద్దకు చేరుకున్నారు. రాంజీగోండు స్ఫూర్తికేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్మారకస్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయ్యి ఉరులమర్రి స్మారక ప్రాంతాన్ని కాపాడుకోవాలన్నారు. ఎక్కడ ఉరులమర్రి ఉందో అక్కడే స్ఫూర్తికేంద్రం నిర్మిస్తామన్నారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, సంకల్పయాత్ర ప్రముఖ్ పల్లె గంగారెడ్డి, సహప్రముఖ్ రావుల రాంనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఔరంగజేబులంతా ఏకమైనా.. నలుగురిని గెలిపించారు

కైలాస్‌నగర్/నేరడిగొండ/ఇచ్చోడ: అసెంబ్లీ ఎన్నికల్లో ఔరంగజేబులంతా ఏకమై బీజేపీ అభ్యర్థులను ఓడించేందుకు యత్నించినా దీటుగా ఎదుర్కొని ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించిన చరిత్ర ఆదిలాబాద్ ప్రజలదని కరీంనగర్ ఎం



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

పీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ, ఇచ్చోడ, ఆదిలాబాద్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజల దెబ్బకు బీఆర్ఎస్‌వాళ్లు ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారన్నారు. ఎంపీ సీటును గెలిపిస్తే ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామన్నారు. మరోసారి కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు ఏర్పడబోతుందని, అధికారం చేపట్టిన వెంటనే ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు మోదీతో శంకుస్థాపన చేయిస్తామన్నారు. రాష్ట్రం అప్పుల పాలైందని, ఖజానా లేదని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలను ఏ విధంగా అమలు చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. బీఆర్ఎస్ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారని, అలాంటి పార్టీతో పొత్తు పెట్టుకోవాలా అని ఎద్దేవా చేశారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, యాత్ర ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, పార్లమెంట్ కన్వీనర్ బోయర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో జిల్లా న్యాయమూర్తులు కె.యువరాజు, అనంతలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌బాబులతో కలిసి బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో రాజీ మార్గం ద్వారా అధిక కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలన్నారు. న్యాయవాదులు, పోలీసులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సమన్వయంతో పని చేసి, కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 61 సైబర్‌క్రైం కేసులు నమోదైనట్లు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుంచి జాబితా పంపించారని, ఈ కేసులను ప్రీ లిటికేషన్ కేసుల కింద పరిష్కరించాలన్నారు. రాజీకి అవకాశం ఉన్న అన్ని సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకునే విధంగా చూడాలన్నారు.

మెరుగైన సేవలందించాలి

కాగజ్‌నగర్‌రూరల్: బాధితులకు మెరుగైన సేవలందించాలని జీహెచ్ఎస్ ఈఎంఆర్ఐ రాష్ట్ర కార్యాలయ క్వాలిటీ అధికారి కిషోర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ అన్నారు. మండలంలోని 108 వాహనాన్ని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

'పది' విద్యార్థులపై దృష్టి సారించాలి

వాంకిడి(ఆసిఫాబాద్): ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతులు, విద్యార్థుల హాజరు, రోజువారీ టెస్టుల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు గణితం ప్రశ్నలు ఇచ్చి లెక్కలు చేయించారు. ప్రత్యేక తరగతులకు గైర్హాజరవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్ పాల్గొన్నారు.

వందరోజుల పని కల్పించాలి

ఉపాధిహామీ కూలీలకు వందరోజుల పని కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. వాంకిడి మండలం గోయేగాం శివారులోని వ్యవసా



పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

య భూముల్లో చేపట్టిన చిన్న నీటికుంట పనులను బుధవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీవో వరలక్ష్మి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


అనిల్ (ఫైల్)

మందమర్రిరూరల్(చెన్నూర్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఎస్పీ రోడ్డు అంగడి బజార్‌కు చెందిన బండి అనిల్ (26) మేకల వ్యాన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున పనినిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎర్రగుంటపల్లె రోడ్డు మూలమలుపు వద్ద కింద పడి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడని మృతుని సోదరుడు బండి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మైసమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన


మైసమ్మను దర్శించుకుంటున్న అధికారులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లాలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగే గాంధారి మైసమ్మ జాతర ఏర్పాట్లను మంచిర్యాల ఆర్డీవో రాములు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ బుధవారం పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, పట్టణ ఎస్సై రాజశేఖర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ రాజీనామా ఆమోదం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ ఈ నెల 12న తన పదవికి రాజీనామా చేశారు. కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం రాజీనామా ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం విచారించి రాజీనామాను కలెక్టర్ ఆమోదించినట్లు కమిషనర్ తెలిపారు.

ఎస్టీపీపీ ఈడీని కలిసిన గుర్తింపు సంఘం నాయకులు


ఈడీతో ఎస్టీపీపీ కమిటీ బృందం

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఈడీ చిన్న బసివిరెడ్డిని బుధవారం గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్టీపీపీ కమిటీ బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. పవర్ ప్లాంటు ద్వారా సాధిస్తున్న విద్యుత్ ఉత్పత్తి, సాధిస్తున్న ప్రగతిని వారు వివరించారు. నిరంతరం విద్యుత్ ఉత్పత్తి సాధిస్తూ రాష్ట్రానికి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఏఐటీయూసీ ఎస్టీపీపీ నూతన కమిటీ సెక్రెటరీగా సీహెచ్.సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్రెటరీలుగా జోగు, పర్షయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా దేగల శ్రీనివాస్, ట్రెజరీగా ఎం.సురేశ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా విజయ్, సంతోష్, మోహన్, శ్రీనివాస్, గోపాల్‌లను వారికి పరిచయం చేశారు.

కాంట్రాక్టర్ దోపిడీ


రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న రిమ్స్ కార్మికులు

- వేతనం నుంచి రూ.2 వేలకు పైగా కోత
- రిమ్స్ కార్మికుల కష్టార్జితం కాంట్రాక్టర్ పాలు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- ఏడాదికి పైగా ఇదే తంతు
- నేటి నుంచి నిరసన..
- స్పష్టత ఇవ్వకపోతే మార్చి 7 నుంచి సమ్మె

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో ఓ కాంట్రాక్టర్ కార్మికుల పొట్ట కొడుతున్నాడు. అసలే చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న వారి జీతాల్లోంచి కోత విధిస్తున్నాడు. కలెక్టర్ నుంచి డీఎంఈ స్థాయి అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కార్మికుల పక్షాన ఉండాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సదరు కాంట్రాక్టర్ 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా మారింది. దీంతో విసుగుచెందిన కార్మికులు సమ్మె బాటకు సిద్ధమయ్యారు. గురువారం నుంచి రోజుకు గంట పాటు రిమ్స్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. పరిస్థితిలో మార్పురాకుంటే మార్చి 7 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

కార్మికుల పొట్టగొడుతున్న కాంట్రాక్టర్..

రిమ్స్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్‌కేర్‌లు దాదాపు 500 మంది పనిచేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ కార్మికుల వేతనాల్లో కోత విధిస్తూ నిబంధనలను తుంగలో తొక్కి తనకు నచ్చిన విధంగా బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాడు. ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తారేమోననే భయంతో కార్మికులు ఏం చేయలేక పోతున్నారు. గతేడాది రిమ్స్‌కు వచ్చిన అప్పటి డీఎంఈ రమేశ్‌రెడ్డిని కార్మికులు కలిసి తమగోడు వెల్లబోసుకున్నారు. ఆ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు కాంట్రాక్ట్ రద్దు చేస్తామని చెప్పారు. గతంలో పలుమార్లు ధర్నాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు, అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ల కోసం..

సదరు కాంట్రాక్టర్ దాదాపు రెండేళ్ల క్రితం రిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్, సానిటేషన్, పేషెంట్‌కేర్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం 0.01 (ఒకపైస) శాతం కమీషన్‌పై కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. నిబంధనల ప్రకారం నెలకు ఒక్కో కార్మికుడికి రూ.15,600 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ.12,093 కార్మికుడి ఖాతాలో జమ చేయాలి. రూ.3,023 పీఎఫ్ కట్టాలి. రూ.484 ఈఎస్ఐ జమ చేయాలి. ఇందుకు భిన్నంగా కార్మికులకు నెలకు రూ.11వేలు అకౌంట్‌లో జమ చేస్తున్నాడు. పీఎఫ్ రూ.వెయ్యి, ఈఎస్ఐ రూ.200 వరకు చెల్లిస్తున్నాడు. ఆస్పత్రి నిర్వహణ కోసం ప్రభుత్వం 5 శాతం కమీషన్ కాంట్రాక్టర్‌కు చెల్లిస్తుంది. తాను దక్కించుకున్న 0.01 శాతం కమీషన్ కూడా ఇస్తోంది. ఇది సరిపోదన్న రీతిలో కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాడు. అయితే అతను అందుబాటులో ఉండకుండా హైదరాబాద్‌లో ఉండటం, అక్కడి నుంచే వ్యవహారాలను సాగిస్తుండడంతో కార్మికులు తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందంటున్నారు. అధికారులను ప్రశ్నిస్తే తమ చేతుల్లో ఏమీలేదని దాట వేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వేతనాల్లో కోత విధిస్తున్నాడు



గతంలో ఉన్న కాంట్రాక్టర్ కూడా పీఎఫ్ కాజేశాడు. ప్రస్తుత కాంట్రాక్టర్ సైతం వేతనాల్లో కోతలు విధిస్తున్నాడు. పలుమార్లు రిమ్స్ డైరెక్టర్‌తో పాటు డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. నెలకు రూ.15,600 చెల్లించాల్సి ఉండగా, రూ.13వేల వరకు కూడా జీతం రావడం లేదు. కాంట్రాక్టర్ అందుబాటులో ఉండడం లేదు. వేతనం అందకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నాం.

– జి.సంగీత, పేషెంట్‌కేర్

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి



ప్రభుత్వం విడుదల చేసిన జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి. కాంట్రాక్టర్ నిబంధనలు ఉల్లంఘించి వేతనాల్లో కోత విధిస్తున్నాడు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. నెలకు రూ.11వేలు మాత్రమే ఖాతాలో జమ అవుతున్నాయి. పీఎఫ్, ఈఎస్ఐ పోనూ నెలకు రూ.12,093 వేతనం అందాల్సి ఉంది. కాంట్రాక్టర్ ఇష్టారీతిన కోతలు విధిస్తున్నాడు.

– ముజీబ్, సెక్యూరిటీ గార్డ్

పరిష్కరించకుంటే సమ్మెబాట



కాంట్రాక్టర్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను నిలువునా దోచుకుంటున్నాడు. ఒక్కో కార్మికుడి నుంచి ప్రతినెల రూ.2వేలకు పైగా వేతనంలో కోత విధిస్తున్నాడు. గురువారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతాం. సమస్య పరిష్కారం కాకపోతే మార్చి 7 నుంచి సమ్మెకు దిగుతాం.

–సిర్ర దేవేందర్,
తెలంగాణ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

- డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వర్‌రెడ్డి


శ్రీరాంపూర్ ఓసీని సందర్శిస్తున్న డైరెక్టర్

నస్పూర్(మంచిర్యాల): కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి శ్రీరాంపూర్ ఓసీని సందర్శించారు. సీఆర్ఆర్ కంపెనీ లోడింగ్ పని ప్రదేశాలను పరిశీలించి ఓబీ ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం 162.45 హెక్టార్ల అటవీ భూమి బదలాయింపు చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఓసీ ఇన్‌చార్జి పీవో ఎం.శ్రీనివాస్, గని మేనేజర్ సుధీర్ జక్కులవార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, అధికారులు చంద్రశేఖర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీబీఎస్ఈ 'పది' పరీక్షలు


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ (సీబీఎస్ఈ) పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత కేంద్రాలకు అనుమతించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్షలు జరిగాయి. కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో హిందీ పరీక్షకు 34 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఎన్నికల వేళ ప్రక్షాళన

- అన్ని శాఖల్లో అధికారులకు స్థానచలనం
- విధుల్లో చేరిన అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాలో బదిలీల కోలాహలం నెలకొంది. అన్ని శాఖల్లోనూ బదిలీల ప్రక్షాళన సాగుతోంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు దీర్ఘకాలంగా ఒకే చోట కొనసాగుతున్న అధికారులకు స్థానచలనం కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ మద్దతుదారులుగా ముద్రపడి ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు ఎదుర్కొన్న వారందరినీ బదిలీ చేశారు. పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, రవాణాశాఖ ఇలా అన్ని శాఖల్లో ఉన్నతాధికారులు మారారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈవీఎంల మొదటి స్థాయి పర్యవేక్షణ పూర్తి కాగా సెక్టోరియల్ అధికారుల శిక్షణ, ఎన్నికల సిబ్బంది సమాయత్తంపై చర్యలు చేపట్టారు.

పోలీసుశాఖలో..

రామగుండం పోలీసు కమిషనర్‌గా ఎం.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల ఏసీపీగా ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీగా వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీగా రవికుమార్ విధుల్లో చేరారు. జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, ఎక్సైజ్ సీఐ బదిలీపై వెళ్లారు.

- జెడ్పీలో సీఈఓగా గణపతి, డిప్యూటీ సీఈఓగా రవీందర్, డీఆర్‌డీఓగా కిషన్, మంచిర్యాల, బెల్లంపల్లి డీఎల్‌పీఓలు, జిల్లాలోని 16 మండలాల్లోని ఎంపీడీఓలు, 11 మండలాల్లో తహసీల్దార్లు, నస్పూర్, మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్లు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి, డీపీఆర్ఓ బదిలీ అయ్యారు.

మూకుమ్మడిగా..

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని డీటీఓ, ముగ్గురు ఎంవీఐలు, ముగ్గురు ఏఎంవీఐలను మూకుమ్మడిగా బదిలీ చేశారు. వారి స్థానాల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు విధుల్లో చేరారు.

కాంగ్రెస్‌లోకి కౌటాలఎంపీపీ..!


దీపాదాస్ మున్షీతో ఎంపీపీ

కౌటాల/బెజ్జూర్: కౌటాల (బీఆర్ఎస్) ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ బుధవారం సాయంత్రం ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల క్రితం ఢిల్లీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సైతం కలిశారు. ఆయన పార్టీ ఫిరాయిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై 'సాక్షి' ఎంపీపీని ఫోన్‌లో సంప్రదించగా కాంగ్రెస్‌లో చేరిక వాస్తవమేనని తెల్చి చెప్పారు. మరో వారం రోజుల్లో తన అనుచరులతో కలసి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు వివరించారు.

నేడు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం సెపక్ తక్రా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–14, అండర్–18 క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఈనెల 24, 25 తేదీల్లో నల్గొండలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు సెపక్ తక్రా అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్ 9948629413, కోచ్ కుమ్మరి మల్లేశ్‌ను 9032126050 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సురక్షిత జాతర పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: మేడారంతోపాటు జిల్లాలో సమ్మక్క–సారాలమ్మ జాతరను సురక్షితంగా జరుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం, రాష్ట్ర కాలుష్య నివారణ మండలి పర్యావరణ విభాగం రూపొందించిన పోస్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ పర్యావరణ విద్య జిల్లా కో–ఆర్డినేటర్ యోగేశ్వర్, సంఘం అధ్యక్షుడు హన్మండ్లు, కార్యదర్శి రమేశ్, జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

పొలాస విద్యార్థుల పొలంబాట


సాగు ప్రదర్శనలు పరిశీలిస్తున్న విద్యార్థులు

జైపూర్(చెన్నూర్): ఇప్పటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు పొలంబాట పట్టారు. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు బుధవారం జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో తిరుగుతూ పంటపొలాలను పరిశీలించారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో సేద్య విధానాలు, రైతులు సాగు చేస్తున్న పంటలు, వారి అనుభవాలు తెలుసుకున్నారు. అనంతరం జైపూర్ రైతు వేదికలో సామాజిక వనరుల గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తూలనం, ప్రిఫరెన్స్ ర్యాంకింగ్, సమస్యల చెట్టు, కాలక్రమం తదితర అంశాలపై ముగ్గులతో చిత్రాలు వేసి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ, నాగరాజు, ఏడీఏ రాజేశం, ఏవో మార్క్‌గ్లాస్టన్, ఏఈవో కొమురయ్య, విద్యార్థులు హర్షిత్, సుశాంత్, శ్రీవత్స, రాంప్రసాద్, వివేక్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ నిల్వలను సరిచేయాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ నిల్వలను సరిచేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు బుధవారం సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచూరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం అందించిన సీఎంపీఎఫ్ బుక్కుల్లో 2017 నుంచి 2021 వరకు నిల్వల వివరాలు ఉన్నాయన్నారు. అయితే కార్మిలకు సంబంధించి సీఎంపీఎఫ్ డబ్బులు తక్కువగా చూపిస్తుండటంతో దాన్ని సరి చేయాలని కోరారు. ఏడాదికోసారి చిట్టీల రూపంలో నిల్వలను తెలియజేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే అతని సీఎంపీఎఫ్ డబ్బులను కార్మికుడి ఖాతాలో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం ఇన్‌చార్జి బయ్య మొగిళి, ఏఐటీయూసీ ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు నర్సయ్య, అశోక్, సాగర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీకేర్స్‌తో సీఎంపీఎఫ్ సేవలు పారదర్శకం

- సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచూరీ



మాట్లాడుతున్న కమిషనర్ హరి పచూరీ

రెబ్బెన(ఆసిఫాబాద్): బొగ్గు గనుల్లో పనిచేసే ఉద్యోగులు త్వరలో సీకేర్స్ పోర్టల్ ద్వారా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచూరీ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం రవిప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంపీఎఫ్ సేవలను మరింత సులభతరం, పారదర్శంగా అందించేందుకు సీకేర్స్ పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో అన్నిరకాల లావాదేవీలు సీకేర్స్ పోర్టల్ ద్వారానే జరుగుతాయన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, డీజీఎం ఫైనాన్స్ రామారావు, పర్సనల్ మేనేజర్ తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మేడారం వెళ్తున్న బస్సును ఢీకొన్న లారీ

- 20 మంది ప్రయాణికులకు గాయాలు


సంఘటన స్థలంలో బస్సు, లారీ


గాయపడిన లావణ్య


గాయపడిన చిన్నక్క


గాయపడిన అశ్రిత

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డిపో నుంచి (కామారెడ్డి బస్సు) మేడారం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. మంగళవారం రాత్రి 9:30 గంటలకు మంచిర్యాలకు చెందిన 49 మంది ప్రయాణికులు ప్రత్యేక బస్సులో బయలుదేరారు. భూపాలపల్లి జిల్లా కాటారం సమీపానికి చేరుకోగానే రాత్రి దాదాపు 12:10 గంటలకు బస్సు, లారీ ఢీకొన్నాయి. ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. బస్సు డ్రైవర్ ఎంఎం అలీ కాలు, చేతులకు, ఇస్మాయిల్‌కు నడుం, కండక్టర్ బాలయ్యకు గాయాలయ్యాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. క్షతగాత్రులను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జాతరకు వెళ్లి.. ప్రమాదానికి గురై...

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన ముప్పిడి చిన్నక్క, పెంచాల శ్రీనివాస్, ముడివెల్లి వెంకటేష్, నీలం సుస్మిత కుటుంబ సభ్యులు ఆర్టీసీ బస్సులో మేడారం జాతరకు బయలుదేరారు. భూపాలపల్లి సమీపంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న బస్సును వెనుకనుంచి వచ్చిన బొగ్గు లారీ ఢీకొట్టింది. క్షతగాత్రులను భూపాలపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

నెన్నెల వాసులకు గాయాలు

నెన్నెల: భూపాలపల్లి జిల్లా మేడిపల్లి వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో నెన్నెలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుడు తోట రాజేశ్, సుమలత, దంపతులు, అక్క తోట భూమక్కతో కలిసి మేడారం బయలు దేరారు. బస్సు ప్రమాదానికి గురికావడంతో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీ

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లిలో శ్రీ లక్ష్మీనరసింహ రైస్‌మిల్లులో బుధవారం రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఇందులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం మిల్లింగ్‌కు శ్రీ లక్ష్మీనరసింహ రైస్‌మిల్లుకు 38,265 బ్యాగుల ధాన్యం కేటాయించగా 2,174 బ్యాగుల ధాన్యం మాత్రమే అందుబాటులో ఉంది. అందులో 36,091 వరిధాన్యం బ్యాగులు కనుమరుగయ్యాయి. ఈ మేరకు శ్రీ లక్ష్మీ నరసింహా రైస్‌మిల్లుపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ముబిన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'పెద్దపల్లి ఎంపీ సీటు బీజేపీదే'


మాట్లాడుతున్న కొప్పు బాషా

మంచిర్యాలటౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎగిరేది బీజేపీ జెండానేనని పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కొప్పు బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి మాట్లాడారు. ఈ నెల 23వరకు పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి విజయ సంకల్ప యాత్ర చేపట్టడం జరుగుతుందని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రజనీశ్ జైన్, తులా ఆంజనేయులు, అశోక్ వర్ధన్, మల్లికార్జున్, హరికృష్ణ, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీబీఎస్ఈ 'పది' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ (సీబీఎస్ఈ) పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత కేంద్రాలకు అనుమతించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్షలు జరిగాయి. కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో హిందీ పరీక్షకు 34 మంది విద్యార్థులు హాజరయ్యారు.